నేడు మొక్కలు నాటనున్న ఎమ్మెల్యే

బడంగ్‌పేట, జూలై13: బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధి లోని 26వ డివిజన్‌లో ఉన్న తిరుమల్ నగర్ కాలనీలో రామిడి కళావతి స్మారక భవనం ప్రారంభోత్సవానికి, నాదర్‌గుల్ చాణక్య పురి కాలనీలో మొక్కలను నాటే కార్యక్రమానికి ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి హాజరుకానున్నారు. కాలనీవాసులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

భగాయత్‌లో సమస్యలపై జడ్పీకి వినతి

జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ప్రతినిధులు

రామంతాపూర్,జూలై 13: ఉప్పల్ భగాయత్‌లోని హెచ్ఎండీఏ లేవుట్‌లో పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం అసోసియేషన్ కన్వీనర్ మేకల మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్‌కేశవ్ పటేల్ వినతి పత్రం సమర్పించారు. లేవుట్‌లో పారిశుధ్య అధ్వానంగా ఉందని, వీధిదీపాలు,డ్రైనేజీ వ్యవస్థ, గుంత లు పడినా రోడ్లతో ప్రజలు అవస్థలు పడుతున్నారని కమిషనర్ దృష్టికి తెచ్చారు లేవుట్ పేరుతో ఇంటి నంబర్లు వచ్చేలాచర్యలు తీసుకోవాలన్నారు. వీలైనంత త్వరలో చర్యలు తీసుకుంటానని కమిషనర్ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు శ్రీనివాస్‌రావు,అంజిరెడ్డి, సుధాకర్,నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

కీసర, జూలై 13: భక్తుల సౌకర్యార్థం చీర్యా ల్ శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ చైర్మన్ లక్ష్మీనారాయణగౌడ్ ఆధ్వర్యంలో ఆలయంలో శనివారం భక్తులకు అన్నదానం చేశారు.కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఇందిరలక్ష్మీనారాయణ, ఆలయ ధర్మకర్త శ్రీహరిగౌడ్, భక్తులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

కందుకూరు, జూలై 13 : గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. మహేశ్వరం మార్కెట్ మాజీ డైరెక్టర్ సామ ప్రకాశ్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు తాళ్ల కార్తీక్, బొక్క దీక్షిత్‌రెడ్డి, కొత్తగూడ మాజీ ఉపసర్పంచ్ బొక్క సత్యనారాయణరెడ్డి ఆమెను కలిసి కొత్తగూడ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. సీతారామ ఫంక్షన్ హాల్ నుంచి సీసీ రోడ్డు నిర్మాణం, అంగన్‌వాడీ భవనం నిర్మాణం, మినీస్టేడియం వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేస్తానని అందుకోసం తనకు సహకరించాలని కోరారు. ఎన్నికల సమయంలో రాజకీయాలు తప్ప ఇతర సమయాల్లో రాజకీయాలు చేయవద్దని కోరారు. గ్రామాల అభివృద్ధి కోసం మాజీ సీఎం కేసీఆర్ పెద్దపీట వేసినట్లు తెలిపారు.అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బొక్క శివారెడ్డి పాల్గొన్నారు.

అమ్మవారికి కుంకుమార్చన

బోడుప్పల్,జూలై13: బోడుప్పల్ మాతా నిమిషాంభికా అమ్మవారికి విశేషకుంకుమార్చన శనివారం ఘనంగా జరిగింది. 2వందల కిలోల కుంకుమను వేదమంత్రోచ్చరణలతో అభిషేకించారు. అనంతరం అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అధ్యాత్మికవేత్త, ప్రవచనకర్త అనంతలక్ష్మి, మహిళలు సామూహిక లలితా సహస్రనామ పారాయణం మధ్య వేదబ్రాహ్మణులు కుంకుమార్చన క్రతువు నిర్వహించారు.కార్యక్రమంలో వందల సంఖ్యలో భక్తులు, ఆలయ చైర్మన్ వినోద్‌కుమార్, అశోక్‌కుమార్, శ్రీనివాస్, రమేశ్, నిర్వాహకులు శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ విందుకు త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి హాజరు



త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డిని సన్మానిస్తున్న కార్పొరేటర్లు

మలక్‌పేట, జూలై 13: మూసారాంబాగ్ డివిజన్‌లోని సలీంనగర్‌లో శుక్రవారం రాత్రి భాగ్యనగర జిల్లా కోశాధికారి రమేశ్‌రెడ్డి నిర్వహించిన ఆత్మీయ(ప్రత్యేక) విందు కార్యక్రమానికి త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సలీంనగర్‌లోని షిర్డీసాయి సంస్థాన్ ఆలయంలో గవర్నర్ సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఆలయకమిటీ సభ్యులు తీర్థ, ప్రసాదాలను అందజేసి ఆశీర్వదించారు. బీజేపీ నాయకులు భాగ్యనగర జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్ రెడ్డి, కార్పొరేటర్లు బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి, బొక్క మధుసూదన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని సత్కరించారు.

ప్రత్యంగిరా అమ్మవారికి అభిషేకం

లక్ష పుష్పార్చన సేవలో పాల్గొన్న డిప్యూటీ సీఎం సతీమణి మల్లు నందిని

ఆర్కేపురం, జూలై 13 : ఆర్కేపురం డివిజన్‌లోని కుర్తాళ పీఠం శ్రీ వారహి సమేత శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి దేవాలయంలో వారాహి దేవి నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. ప్రతిరోజు వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటున్నారు. మహిళలతో నిర్వహిస్తున్న కుంకుమార్చన, పారాయణలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. 18 రకాల ద్రవ్యాలతో అమ్మవారికి విశేష అభిషేకం నిర్వహించారు. శనివారం డిప్యూటీ సీఎం సతీమణి మల్లు నందిని అమ్మవారిని దర్శించుకొని లక్ష పుష్పార్చన సేవ, హోమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుర్తాళం పీఠాధిపతులు జగద్గురు శ్రీ సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి గొప్ప మంత్ర స్వరూపులని, వారు చేసే అన్ని కార్యక్రమాల్లో పాల్గొనడం అదృష్టమని తెలిపారు. అనంతరం అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్, విఠల్ శర్మ, సంపత్, అరుణ, రాజేశ్వరి, హేమ, సాయికుమార్‌శర్మ, రామశర్మ పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నగర చిన్నోడికి స్థానం

ఎల్బీనగర్, జూలై 13: హైదరాబాద్ నగరానికి చెందిన చిన్నోడు ప్రపంచ రికార్డును సొంతం చేసుకున్నాడు. హైదరాబాద్ నగరం ఎల్బీనగర్ నియోజకవర్గం న్యూ మారుతీనగర్‌కు చెందిన టాకూర్ మాన్విక్ చౌహాన్ కేవలం 29 రోజుల్లో ఆధార్ కార్డు నంబర్, 65 రోజుల్లో పాస్‌పోర్టును సాధించి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డుల్లో చోటు దక్కించుకున్నాడు. కొత్తపేట న్యూ మారుతీనగర్ రోడ్ నంబర్ 7బీకి చెందిన టాకూర్ జగదీశ్ చౌహాన్, అనురాధ దంపతుల కుమారుడైన కార్తీక్ చౌహాన్, స్రవంతి చౌహాన్‌లకు 2024 ఏప్రిల్ 24న టాకూర్ మాన్విక్ చౌహాన్ జన్మించాడు. హైదరాబాద్ నగరంలోని నల్గొండ చౌరస్తా పుష్పా నర్సింగ్‌హోంలో జన్మించిన మాన్విక్ చౌహాన్ పేరిట అంతర్జాతీయ రికార్డ్సులో తన పేరు నమోదు చేసుకున్నాడు. చిన్నారి జన్మించిన వెంటనే మాన్విక్ తండ్రి కార్తీక్ చిన్నారుల రికార్డులను సెర్చ్ చేసి మాన్విక్ పేరిట ఆధార్ నంబర్‌ను కేవలం 29 రోజుల్లో నమోదు చేయించాడు. పాస్‌పోర్టు కూడా కేవలం 65 రోజుల్లో సాధించి రికార్డును సొంతం చేసుకున్నాడు. ఈ మేరకు పంజాబ్‌లోని ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వారి నుంచి శుక్రవారం మాన్విక్ తల్లిదండ్రులు కార్తీక్, స్రవంతిలకు సమాచారం వచ్చింది. టాకూర్ మాన్విక్ చౌహాన్ తల్లి స్రవంతి ఐసీఐసీఐ బ్యాంక్‌లో బ్రాంచ్ మేనేజర్ కాగా తండ్రి కార్తీక్ వ్యాపారి. తమ కుమారుడి పేరు రికార్డులో నమోదైనట్లుగా తెలియగానే వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

మాన్విక్ చౌహాన్‌తో తల్లిదండ్రులు

డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలి

ఎస్‌టీపీ పనులను పరిశీలిస్తున్న సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

మలక్‌పేట, జూలై 13: సైదాబాద్ డివిజన్‌లో డ్రైనేజీ సమస్యలన్నింటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి మలక్‌పేట డివిజన్ వాటర్‌వర్క్స్ డీజీఎం షీలారాణిని కోరారు. సాయిరాం కాలనీలో కొనసాగుతున్న ఎస్‌టీపీ పనులను శనివారం ఆమె డీజీఎం షీలారాణి, మేనేజర్ శ్రావణ్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అనేక కాలనీల్లో తాగునీటి, డ్రైనేజీ పైపులైన్ల సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని, వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. వర్షాలు ఎక్కువైతే కాలనీవాసులు ఇబ్బందులు పడతారని, సమస్యలు జఠిలం కాక ముందే పరిష్కరించేందుకు కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, కిశోర్, పరమేశ్ పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు పరిశీలన

రామంతాపూర్,జూలై 13 : రామంతాపూర్ డివిజన్‌లోని భరత్‌నగర్‌లో రూ.75 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను శనివారం స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధిలో ముందుకు తీసుకుపోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్వేత,వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేందర్ పాల్గొన్నారు.

రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

గ్రాడ్యుయేషన్ డే

బడంగ్‌పేట,జూలై13: మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న టీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఐపీఎస్ అధికారి లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, మాజీ జడ్పీచైర్‌పర్సన్ అనితా రెడ్డి, కళాశాల కార్యదర్శి తీగల హరినాథ్ రెడ్డి, కోశాధికారి తీగల అమర్‌నాథ్ రెడ్డిలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు.విద్యార్థులకు డిగ్రీ పట్టా సర్టిఫికెట్లను అందజేశారు. విద్యార్థులు కష్టపడి చదువుకొని తల్లిదండ్రులకు, విద్య నేర్పిన గురువులకు మంచి పేరు తీసుకురావాలన్నారు.క్రమశిక్షణ గల విద్యార్థి సమాజ మార్పు కోసం పనిచేస్తారన్నారు.

ధ్యానాంజనేయ స్వామి ఆలయంలో 'మల్‌రెడ్డి' పూజలు

వేద పండితుల ఆశీర్వచనాలు పొందుతున్న మల్‌రెడ్డి రాంరెడ్డి దంపతులు

చంపాపేట, జూలై 13: చంపాపేట డివిజన్ పరిధి కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయాన్ని తెలంగాణ రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి శనివారం కుటుంబ సమేతంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ కార్య నిర్వహణ అధికారి శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి, మంగళ వాయిద్యాలతో ఆహ్వానించారు. అనంతరం వారు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి స్వామివారి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేసి, ఆలయ వేద పండితులతో ఆశీర్వచనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చక బృందం, ధర్మకర్తలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఉప్పల్, జూలై 13: ఉప్పల్, రామంతాపూర్ ప్రాంతాల్లో ఉప్పల్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలు, డ్రగ్స్ నివారణ చర్యలపై శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈమేరకు ఉప్పల్ ట్రాఫిక్ సీఐ లక్ష్మీమాధవి హాజరై అవగాహన కల్పించారు. డ్రగ్స్‌ను అరికట్టేవిధంగా ప్రజలు తగిన తోడ్పాటు అందించాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, అనుమానం వచ్చిన వ్యక్తుల కదలికలను పోలీసులకు తెలియజేయాలన్నారు. డ్రగ్స్, గం జాయి రవాణకు వాహనాలు ఉపయోగిస్తారని, వీటిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ సూర్యానాయక్, ఎస్సై మహిపాల్ రెడ్డి, ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ లక్ష్మీమాధవి

నేడు విద్యుత్ సరఫరా బంద్

ఉప్పల్, జూలై 13: నవభారత్ ఫీడర్‌లోని నవభారత్, చెంవెదలేన్, అశోక్‌లేలాం డ్, మోడ్రన్ బేకరి, ఎన్ఆర్‌బీ ఇండస్ట్రీ, డీఎస్ఎల్, తదతర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం12గంటల వరకు, ఐడీఏ ఉప్పల్, గుబ్బా, ఫెర్రోకాస్ట్, ఈఎస్ఐ హాస్పిటల్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అదేవిధంగా అజంత హోటల్ లేన్, శ్రీకృష్ణఫార్మ, ఎస్ఎస్ బయోటెక్, ఉప్పల్ పారిశ్రామిక ప్రాంతంలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఉప్పల్ భగాయత్ ఏఈ కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

కోచింగ్ సెంటర్ల మాఫియాను కట్టడి చేయాలి

కాప్రా, జులై 13: రాష్ట్రంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ కోచింగ్ సెంటర్లను కట్టడి చేయాలని, నిరుద్యోగులు ప్రభుత్వ స్టడీ సర్కిళ్లను వినియోగించుకోవాలని అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్,ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్ అన్నారు. ఏఐవైఎఫ్ ఉప్పల్ మండల సమావేశం ఈసీఐఎల్‌లోఓని నీలం రాజశేఖర్‌రెడ్డి భవనంలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కోచింగ్ సెంటర్ల ఆగడా లు మితిమీరుతున్నాయనీ, అధిక మొత్తం లో ఫీజులు గుంజుతున్నారని వారు ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని, నోటిఫికేషన్ల ద్వారా ఉద్యోగాలను భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నేతలు గిరిబాబు, చంద్రశేఖర్, రవి కుమార్, స్వప్న,సంధ్యరాణి, కిరణ్, ప్రణ వ్, సూర్య, భరత్ పాల్గొన్నారు.

విద్యకు పేదరికం అడ్డుకాదు

మణికొండ, జూలై 13: అందరికి విద్య అందాలనే ధ్యేయంతో వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ కృషి చేస్తుందని అధ్యక్షుడు వోలం యాదగిరి అన్నారు. ఎస్ఆర్ మాడల్ స్కూల్‌లో 6వ తరగతి విద్యార్థిని జి.అక్షితకు రూ.6 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకున్నప్పుడే ఉన్నత శిఖరాలకు చేరుతారన్నారు. విద్యకు పేదరికం అడ్డు కాకూడదని సూచించారు.

విద్యతోనే సమాజంలో మార్పు

నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

సాంస్కృతిక ప్రదర్శనలు చేస్తున్న విద్యార్థులు

బడంగ్‌పేట, జూలై13: విద్యతోనే సమాజంలో మార్పు వస్తుందని భాష్యం స్కూల్ ఇన్‌చార్జి అంకమ్మ రావు అన్నారు. మీర్‌పేటలో ఉన్న భాష్యం స్కూల్‌లో ఫ్రెషర్స్ డే కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు అభిరుచులకు అనుగుణంగా విద్యా బోధన ఉంటుందన్నారు. విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి అధ్యాపకులు ప్రయత్నం చేస్తారన్నారు. చదువుతో పాటు విద్యార్థులను అన్ని రంగాలలో రాణించే విధంగా తీర్చిదిద్దుతామన్నారు. పాఠశాల దశ విద్యార్థుల భవిష్యత్‌కు పునాది అన్నారు. పట్టుదలతో చదువుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్రవంతి, శృతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే బంగారు భవిష్యత్

ఆర్కేపురం: విద్యార్థులు కష్టపడి చదివితే భవిష్యత్‌కు బాటలు వేసుకోవచ్చని డాక్టర్ సంతోష్‌రెడ్డి అన్నారు. శనివారం దిల్‌సుఖ్‌నగర్ భాష్యం పాఠశాల విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలను ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా. సంతోష్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలని తెలిపారు. మంచి ఆహారం, సరైన నిద్ర, ప్రతి రోజు వ్యాయామం చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. జీవితానికి ఉపయోగపడే వాటి పై విద్యార్థులు ఏకాగ్రత, మనసు పెట్టి నేర్చుకోవాలని సూచించారు. అనుకున్నది సాధించే వరకు లక్ష్యంతో ముందుకు పోవాలని తెలిపారు. సమయం చాలా విలువైందని, పోయిన కాలం తిరిగిరాదని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల జడ్ఈవో అంకమ్మరావు, ప్రిన్సిపాల్ పల్లవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో 1995 బ్యాచ్‌కు చెందిన ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులు

మలక్‌పేట, జూలై 13: దిల్‌సుఖ్‌నగర్‌లోని అవంతి డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం నిర్వహించిన 'అలమ్నీ మీట్' (పూర్వ విద్యార్థుల సమ్మేళనం) తీపి జ్ఞాపకాలకు వేదికైంది. 30 ఏళ్ల తర్వాత (1995 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు) వివిధ రంగాల్లో స్థిరపడ్డ ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులు కళాశాలలోని సమావేశ మందిరం వద్దకు రాగా కళాశాల ఉపాధ్యక్షుడు డాక్టర్ అప్పారావు అలమ్నీకి విద్యార్థులను ఆహ్వానించారు. అంతా ఒకే చోట చేరిన పూర్వ విద్యార్థులు ఒకరి కొకరు ఆత్మీయ ఆలింగనాలు చేసుకుంటూ, వారి కుటుంబాల యోగా క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి దశలోని మరపురాని పాతతీపి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఎన్నో అనుభూతులను మూటగట్టుకున్నారు. సినిమాల్లోని కామెడీ సీన్లను తలపించేలా యాక్టింగ్‌చేస్తూ అందరిని ఆశ్చర్య పరిచారు. విద్యనభ్యసించిన కళాశాల అభివృద్ధికి కృషి చేద్దామంటూ తీర్మానాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉస్మానియా యూనివర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ అకడమిక్ ఆడిట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యనందించిన కళాశాలకు తమవంతు సౌలభ్యాలను అందించాలని సూచించారు. అభిప్రాయాలను తోటి విద్యార్థులతో షేర్ చేసుకోవాలని, విద్యార్థులు తమవంతుగా సమాజానికి కూడా సేవలందించాలని అవంతి విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ ప్రియాంక, హెచ్ఆర్ డైరెక్టర్ డాక్టర్ జయప్రద అన్నారు. ఈ సమ్మేళనంలో హైదరాబాద్ ఏంజెల్స్ సీఈఓ డాక్టర్ సీఏ రత్నాకర్ సామవేదం, కళాశాల ఉపాధ్యక్షుడు డాక్టర్ అప్పారావు, ఏఓ మోహన్‌రావుతోపాటు 300 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

శిల్పారామంలో స్వర నృత్య విభావరి

కళాకారుల ప్రదర్శన

ఉప్పల్, జూలై 13: వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం స్వర నృత్య విభావరి నిర్వహించారు. ఈ కార్యక్రమం సందర్శకులను ఎంతో ఆకట్టుకుంది. ఈ మేరకు త్రిశతి, శ్రీనిధి,అనన్య,మయూఖ,స్నేహ, ప్రణతి, హృతిక , సంజన, వైష్ణవి సంగీత ఆలపన చేశారు. అనంతరం తాండవ నృత్యకారి, మూషికవాహన, తక్కువేమి మనకు జతిస్వరం, చేరి యశోదకు, తదితర అంశాలను ప్రదర్శించారు.

తాగునీరు అందించండి

బండ్లగూడ, జూలై 13: తాగునీటి సరఫరాను పెంచి ప్రజలకు రోజు విడిచి రోజు తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని జలమండలి మేనేజర్ శ్రీనివాస్‌ను మేయర్ లతాప్రేమ్‌గౌడ్ ఆదేశించారు.

బాలుడు అదృశ్యం

మధుసూదన్(ఫైల్)

పీర్జాదిగూడ, జూలై 13: బాలుడు అదృశ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ...వినాయక నగర్ కాలనీకి చెందిన సంజీవకుమార్ కుమారుడు మధుసూదన్ (13) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. ఈనెల 8న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో శనివారం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువతకు చేయూత అందిస్తాం

ఉప్పల్: యువతకు తగిన తోడ్పాటు అందించి, అభ్యున్నతి సాధించడానికి తనవంతు సహకారం అందజేస్తామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. చిలుకానగర్‌లో కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్‌తో కలిసి చాయస్ షాపును శనివారం ప్రారంభించారు.

బహిరంగ ప్రకటన

సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయునదేమనగా, నా క్లయింట్ చిట్టా శాంతిశ్రీ భర్త చిట్టా సత్యనారాయణ మూర్తి వయస్సు సుమారు 59 సంవత్సరాలు, వృత్తి గృహిణి, నివాసం: ఇం. నం. 29-305/ఎ, శ్రీనిలయ టౌన్‌షిప్, స్ట్రీట్ నం.6, బడంగ్‌పేట, హైదరాబాద్-58 వారు రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్, ఎల్‌బినగర్, మన్సూరాబాద్ గ్రామం, రాక్ టౌన్ కాలనీ వద్ద గల సర్వే నం.9(పాత సర్వే నం. 66/14)లో 542.07 చ.గజాలు విస్తీర్ణం ప్లాట్ నం. 79కి యజమాని మరియు స్వాధీనదారు, కాని వాస్తవాలను మరుగుపరుస్తూ జి. లలితమ్మ GHMC అనుమతి ముగిసిన తర్వాత ఒక బిల్డింగ్ అనగా స్పేస్ టౌన్ రెసిడెన్సీని నిర్మించారు, అందువల్ల GHMC కూడా ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇచ్చేందుకు నిరాకరించినది మరియు GHMC కూడా W.P. నం. 6680/2023తో పాటు వివిధ సివిల్ కేసులతో నాక్లయింట్ మరియు సదరు జి. లలితమ్మ మధ్య గల టైటిల్ వివాదంకు సంబంధించిన సమస్య పరిష్కారమయ్యే వరకు సదరు స్పేస్ టౌన్ రెసిడెన్సీలోని ఫ్లాట్లను విక్రయించరాదని ఆమెను హెచ్చరించినది.

అందువల్ల నా క్లయింట్ భూమిలో నిర్మించిన సదరు బిల్డింగ్‌లోని ఫ్లాట్లను కొనుగోలు చేయరాదని అందరికి ఇందుమూలంగా తెలియజేయడమైనది మరియు ఎవరేని వ్యక్తి/లు సదరు స్పేస్ టౌన్ రెసిడెన్సీలో ఏవేని పార్టీ/భాగం కొనుగోలు చేసినచో వారు ఎలాంటి టైటిల్ పొందలేరు.

సం/- గజ్జల వెంకటరెడ్డి, B.A., B.L.
PGD ADR (Nalsar) LLM, అడ్వకేట్,
చాంబర్ ఆఫ్ లాయర్స్ కలెక్టివ్, ప్లాట్ నం.80/బి,
ఇం.నం. 11-13-177/1, రోడ్ నం.3, గ్రీన్ హిల్స్ కాలనీ, కొత్తపేట్, హైదరాబాద్-500102
సెల్: 9989286688